క్లుప్తంగా

మలికిపురం తహసీల్దారుగా టి.శ్రీనివాస్

మలికిపురం: మలికిపురం మండల తహసీల్దారుగా టి. శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన రాజోలు నియోజకవర్గ శాసన సభ్యులు దేవ వరప్రసాద్‌ను విశ్వేశ్వరాయపురం క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట డీటీ డీపీ రాజు, ఆర్ఐ వేణు గోపాల్ తదితరులు ఉన్నారు.

అల్పపీడనంతో అప్రమత్తంగా ఉండండి

అంబాజీపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాబోయే నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున్న గ్రామాల్లో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో జి.సరోవర్ సూచించారు. వర్షాలకు ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించామన్నారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎటువంటి సంఘటన చోటు చేసుకున్నా తక్షణం సమాచారం ఇవ్వాలని తెలియజేశామన్నారు. అల్పపీడనం కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సరస్వతీ దేవికి వెండి వీణ బహూకరణ



సరస్వతీ దేవికి వెండి వీణను బహూకరించిన దాతలు

అంబాజీపేట: అంబాజీపేట శివారు కొత్తపాలెంలోని హంసవాహనం సరస్వతీ దేవికి గ్రామానికి చెందిన రాయుడు వెంకట రమణ, విజయ మంగాలక్ష్మి దంపతులు వెండి వీణను ఆదివారం బహూకరించారు. సుమారు రూ.1.25 లక్షలు విలువ చేసే వెండి వీణను రమణ దంపతులు కమిటీ సభ్యులకు అందజేశారు. అంతకుముందు వెండి వీణకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వ్యాధి గ్రస్తుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధ పడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆలమూరు మండలం పెదపళ్ల గ్రామానికి చెందిన ఏడిద రవి బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి సోకటంతో హాస్పిటల్‌లో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. వృత్తి రీత్యా టైలర్ కావడంతో వైద్యానికి ఖర్చు పెట్టే స్థోమత లేక గ్రామస్తులు, దాతల సహకారంతో ఇప్పటికే రూ.5 లక్షల వరకు ఖర్చు పెట్టారు. కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరడంతో రవి బంధువుకు సంస్థ సభ్యులు రూ.15 వేల చెక్కును అందజేశారు.

సాయి వీరభద్రస్వామి సన్నిధిలో ఎంపీ మాధుర్

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామంలో కొలువు తీరిన సాయి వీరభద్ర స్వామిని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఎంపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు తులా గోపాలకృష్ణ అతని కుటుంబ సభ్యులు ఎంపీకి స్వాగతం పలికారు. ముందుగా అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామిని ఎంపీ దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన వెంట జెడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.

బౌద్ధ స్థూపం వద్ద కుటుంబాల కలయిక



ఆదుర్రు బౌద్ధ స్థూపం వద్ద ప్రార్థనలు చేస్తున్న బౌద్ధులు

మామిడికుదురు: ఆదుర్రు ఆది బౌద్ధ స్థూపం వద్ద 68వ బౌద్ధ ధమ్మ దీక్షా దినోత్సవంలో భాగంగా కుటుంబాల కలయిక ఆదివారం ఘనంగా జరిగింది. దీనిలో భాగంగా బౌద్ధ స్థూపం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. బౌద్ధ వందనం, దమ్మ వందనం స్వీకరించారు. బుద్ధ విహార్‌లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆదుర్రు బుద్ధ విహార్ కమిటీ కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బుద్ధ విహార్ ట్రస్ట్ కార్యదర్శి ఎస్ఎస్ఆర్ భూపతి, సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు స్థానికులు పాల్గొన్నారు.

మద్యం దందాకు మార్గం సుగమం..!

మద్యం ప్రియులను మత్తులో ముంచి అందిన కాడికి దోచుకునేందుకు అధికారికంగా రంగం సిద్ధమైంది. ఇప్పటి వరకు ప్రభుత్వ పర్యవేక్షణలో అక్రమాలకు తావులేకుండా సాగిన మద్యం వ్యాపారం ఇకపై ప్రైవేటు వ్యక్తుల దందాలకు వేదికగా మారనుంది. మద్యం దుకాణాలను తమ వశం చేసునేందుకు గానూ లాటరీలో లక్‌ను పరీక్షించుకోవడానికి సిండికేట్లు, ఆశావహులు సిద్ధం అవుతున్నారు.

- ప్రభుత్వం నుంచి ప్రైవేటు చేతికి మద్యం దుకాణాలు
- కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాలకు 68 మద్యం దుకాణాలు
- 2,237 దరఖాస్తులు
- అదృష్టాన్ని పరీక్షించుకోనున్న ఆశావహులు

కొత్తపేట: కొత్తపేట, పీ.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాలకు గానూ 68 మద్యం షాపులు కేటాయిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. దరఖాస్తుల గడువు నాటికి 2,237 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని 4 మండలాల్లో 25 షాపులకు 728 దరఖాస్తులు, పీ గన్నవరం నియోజకవర్గ పరిధిలోని 4 మండలాల్లో 24 షాపులకు 742 దరఖాస్తులు, రాజోలు నియోజకవర్గ పరిధిలోని 3 మండలాల్లో 19 షాపులకు 767 దరఖాస్తులు వచ్చాయి.

దోపిడీకి ముందడుగు..

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో వెనుకంజ వేసినా, మద్యం విధానంలో మాత్రం ముందడుగు వేసి మద్యం ప్రియులకు కిక్కు ఎక్కించేందుకు రంగం సిద్ధం చేసింది. విచ్చలవిడి అమ్మకాలకు తెరలేపింది. మద్యం దుకాణాలను ప్రభుత్వం నియంత్రణలో నుంచి ప్రైవేటుకు కట్టబెట్టడానికి నిర్ణయం తీసుకోవడంతో ప్రైవేటు వ్యక్తులు అమ్మకాలకు సిద్ధం అవుతున్నారు. గత ప్రభుత్వం దుకాణాల సంఖ్యను తగ్గిస్తూ, విచ్చలవిడి అమ్మకాలను నియంత్రిస్తూ ఐదేళ్ల పాటు కొనసాగించింది. నూతన ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి పలకడంతో ఈ నెల 15 న ప్రభుత్వం నుంచి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి దుకాణాలు మారబోతున్నాయి.

సిండికేట్‌గా దరఖాస్తులు

ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన మద్యం షాపులకు లైసెన్స్ ఫీజు నిర్ణయించినా మండలం యూనిట్‌గానే షాపులు నిర్ణయించింది. వాటికి ఒకే రకంగా ఫీజు నిర్ణయించింది. ఆ విధంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు ఫీజులో తేడా లేదు. దానితో గ్రామీణ ప్రాంతాల షాపులకు ఫీజు ఎక్కువ అని దరఖాస్తుదారులు భావించారు. వ్యక్తిగతంగా దరఖాస్తు చేస్తే షాపు లాటరీ తగలకపోతే రూ.2 లక్షలు నష్టపోతామని భావించి సిండికేట్‌లుగా కలిసి వెళితే కొన్నయినా షాపులు తగులుతాయని.. దరఖాస్తు రుసుము నష్టపోమనే ఉద్దేశ్యంతో కొందరు కలిసి సిండికేట్‌గా షాపులు దక్కించుకునేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. 20 నుంచి 100 మంది వరకు దరఖాస్తుదారులు కలిసి సిండికేట్ అయ్యారు. వారిలో అత్యధికంగా టీడీపీ, జనసేన నాయకులు ఉన్నారు. షాపులు తెరిచిన నాటి నుంచే ఎంఆర్‌పీ కంటే మించి అమ్మకాలు సాగించాలని యోచిస్తున్నారు. ఆ విధంగా మద్యం ప్రియులపై అదనపు భారం మోపేందుకు ప్రభుత్వ పెద్దల నుంచి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.



కొత్తపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు

- మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు
- రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభం

మలికిపురం: నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై పోరాటానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. మలికిపురంలో రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలకు, ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉంటామన్నారు. ప్రజా ప్రయోజనాల కోసం అహర్నిశలు కృషి చేస్తూ పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో మలికిపురం మండల అధ్యక్షులు అడబాల బ్రహ్మాజీ, సఖినేటిపల్లి మండల అధ్యక్షులు కుసుమ చంద్రశేఖర్, రాజోలు మండల అధ్యక్షులు కట్టా శ్రీను, మామిడికుదురు మండల అధ్యక్షులు బొలిశెట్టి భగవాన్, రాజోలు జెడ్పీటీసీ సభ్యురాలు మట్ట శైలజ, సఖినేటిపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు దొండపాటి అన్నపూర్ణమ్మ, సఖినేటిపల్లి ఎంపీపీ వీర మల్లిబాబు, గుబ్బల మనోహర్, కెఎస్ఎన్ రాజు, జంపన బుజ్జి రాజు, సత్తిబాబు రాజు, సూరిశెట్టి బాబీ, పాటి శివ, కంచర్ల శేఖర్, నక్క రామారావు, చింతలపల్లి సర్పంచ్ సురేష్, కొల్లాబత్తుల నాని, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



మలికిపురంలో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఆలమూరు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి పెంపకం చేపట్టాలని మండలంలోని పలువురు పర్యావరణ వేత్తలు సూచించారు. మండల కేంద్రం ఆలమూరులో రాజకీయ పార్టీలకు అతీతంగా వడ్డా వారి వంతెన సమీపంలో ఆదివారం పార్టీలకు అతీతంగా నాయకులు ఆదివారం మొక్కలు నాటారు. పర్యావరణ హిత సమాజానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. శ్రీకృష్ణ దేవరాయ మండల కాపు అభ్యుదయ సంఘం అధ్యక్షులు డాక్టర్ చల్లా ప్రభాకరరావు తన సొంత నిధులను వెచ్చించి ఈ మొక్కలను సమకూర్చారు. వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవానీ, ఉప సర్పంచ్ చల్లా సీతామహాక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రామానుజుల శేషగిరిరావు, మాజీ ఉప సర్పంచ్ చల్లా నానాజీ, చల్లా భూషణం, శిరిగినీడి పట్టాభి, గన్ని బాబి, చీపురుపల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరులో మొక్కలు నాటుతున్న రాజకీయ పార్టీల నాయకులు

వంట నూనెల విక్రయ దుకాణం ప్రారంభం

అంబాజీపేట: ప్రభుత్వ వంట నూనెల విక్రయ దుకాణాన్ని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి శనివారం ప్రారంభించారు. మాచవరం గణపతి ఆలయం ఎదురుగా ఉన్న షాపులో దుకాణాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు స్థానిక కిరాణా వర్తక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక షాపును ఏర్పాటు చేశామన్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక ఆయిల్ కౌంటర్‌లో 850 గ్రాముల పామాయిల్ ప్యాకెట్‌ను రూ.110కు, 910 గ్రాముల సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్‌ను రూ.124ల ధరకు విక్రయిస్తారన్నారు. తెల్ల రేషన్ కార్డు దారులకు నెలకు 3 పామాలిన్, 1 సన్‌ఫ్లవర్ రిఫండ్ ఆయిల్ ప్యాకెట్లను విక్రయిస్తారన్నారు. అనంతరం విక్టరీ బజార్, గో ఫ్రెష్, కిరాణా షాపులను తనిఖీ చేశారు. ధరలు అధికంగా వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తే షాపులను సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రతీ షాపు వద్ద ధరల పట్టికను వినియోగదారులకు అర్థమయ్యేలా ప్రదర్శించాలన్నారు. అలాగే స్టీమ్ రైస్ కేజీ రూ.48, రా రైస్ రూ.49, కంది పప్పు రూ.148, మినపప్పు రూ.108లకు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెస్వో ఎస్.సత్యనారాయణ, టీడీ సీహెచ్.వెంకటేశ్వరరావు, ఆర్ఐ కె.ఏడుకొండలు, స్థానికులు దొమ్మేటి రామారావు, కిరాణా వర్తక సంఘ అధ్యక్షులు కాసు రాజా పండు, సభ్యులు వాకపల్లి అనంత బాబు, కంచర్ల వెంకన్నబాబు, వీఆర్వోలు, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.



మాచవరంలో ప్రభుత్వ ఆయిల్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరి

గజవాహనంపై ఊరేగిన లక్ష్మీనృసింహుడు



ఆర్డీవోకు స్వామి చిత్రపటం అందజేస్తున్న సిబ్బంది



అంతర్వేదిలో గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి శనివారం భక్తులు అత్యధిక సంఖ్యలో పోటెత్తారు. విజయ దశమి పర్వదినానికి తోడు సెలవు రోజు కావడంతో భక్తుల తాకిడి ఎక్కువైంది. ఆలయంలో నిర్వహించే నారసింహ సుదర్శన హోమం, అభిషేకంలో విశేషంగా భక్తులు పాల్గొన్నారు. విజయ దశమి సందర్భంగా ఆనవాయితీగా గుర్రాలక్క అమ్మవారి ఆలయం, నీలకంఠేశ్వర స్వామి ఆలయం, రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారి ఆలయాల్లో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పట్టువస్త్రాలను సమర్పించారు. దసరా ఉత్సవాలు చివరి రోజు శమీ పూజను గుర్రాలక్క ఆలయం వద్ద అర్చకులు నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు.

నృసింహుని సన్నిధిలో ఆర్డీవో

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నృసింహుని ఆలయంలో శనివారం అమలాపురం ఆర్డీవో కొత్త మాధవి కుటుంబ సమేతంగా స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్డీవోకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. పూజల అనంతరం అర్చకులు వారికి ఆశీర్వచనాలు పలికి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. స్వామివారి చిత్రపటాన్ని ఆలయ సూపరింటెండ్ పీ విజయ సారథి అందజేశారు. డీటీ సీహెచ్.భాస్కర్, వీఆర్వోలు ప్రసాద్, సీతారామం పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని తద్వారా కావాల్సిన సమాచారం అధికారుల నుండి పొందవచ్చని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉందుర్తి నాగబాబు అధ్యక్షతన సమాచార హక్కు చట్టం ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్న వాటికి అధికారులు పూర్తి సమాచారం ఇస్తారన్నారు. అందుకు అధికారులు పూర్తి జవాబుదారీగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, విత్తనాల ఇంద్రశేఖర్, నాగాబత్తుల సుబ్బారావు, నక్కా భాస్కర్, వీరిన గోపాలం, ఉర్రింకి రాంబాబు, కొల్లూరి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి తాగునీటి వసతి

సఖినేటిపల్లి: మండల పరిధిలోని మోరి-2లోని 167వ నెంబరు అంగన్‌వాడీ కేంద్రానికి ఆదివారం స్థానిక ప్రముఖ వైద్యుడు జాన వీరభద్ర ప్రసాద్, ఉమాదేవి దంపతులు తాగునీటి వసతిని ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించి తాగునీటి పైపులు, సింటెక్స్ ట్యాంకు, విద్యుత్ మోటారు సమకూర్చారు. ఐసీడీఎస్ సీడీపీవో వైకేడీ రమాదేవి ఆధ్వర్యంలో కేంద్రంలో సూపర్‌వైజర్ కె.చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు దాతలను సత్కరించారు. ఎంపీటీసీ జాన లక్ష్మీ దుర్గ సూర్యావతి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయం వద్ద ఇంద్రధనస్సు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవీ, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం ఇంద్రధనస్సు కనువిందు చేసింది. ఆలయ ప్రాంగణంలో చోటు చేసుకున్న ఈ అద్భుతాన్ని భక్తులు కళ్లారా వీక్షించారు.

బాధిత విద్యార్థినికి ఆర్థిక చేయూత



దుర్గా భవానీకి నగదు, నిత్యావరాలు అందజేస్తున్న కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘం సభ్యులు

సఖినేటిపల్లి: మండల పరిధిలోని గొంది గ్రామానికి చెందిన విద్యుత్తుషాక్ బాధిత విద్యార్థిని బర్రే దుర్గా భవానీకి కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘం అండగా నిలిచింది. ఆదివారం గొందిలో దుర్గా భవానీని ఇంటి వద్ద సంఘ గౌరవ అధ్యక్షుడు కర్రి స్వామినాథ్, సంఘ కార్యవర్గ సభ్యులు పరామర్శించారు. విద్యార్థిని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. భవానీకి డ్రై ఫ్రూట్స్, నిత్యావసర సరుకులతో పాటు నగదు రూ.11,300లు స్వామినాథ్ అందజేశారు. కాగా దుర్గా భవానీకి జరిగిన ప్రమాద ఘటనను, కాకినాడలో చికిత్స పొందుతున్న వైనాన్ని సామాజిక మాధ్యమాల్లో ఫాలోఅప్ చేసి, సంఘ కార్యవర్గ సభ్యుల సహకారాన్ని ఆయన తీసుకున్నారు. ఈ మేరకు గతంలో సేకరించిన మొత్తం రూ.1.70 లక్షల నగదును కాకినాడలో కుటుంబ సభ్యులకు అందజేసినట్టు స్వామినాథ్ చెప్పారు.

అంబరాన్ని తాకిన దసరా సంబరాలు

- రాజ రాజేశ్వరీదేవిగా అమ్మవార్ల అలంకరణ
- సామూహిక పూజలు, కుంకుమార్చనలు
- రాత్రి విశేష కార్యక్రమాలు, జమ్మిచెట్టు పూజలు
- ముగిసిన శరన్నవరాత్ర వేడుకలు



అంబాజీపేటలో గజవాహనంపై ఊరేగుతున్న శ్యామలాంబ అమ్మవారు



రాజ రాజేశ్వరీ దేవిగా కొత్తపేట బొరుసువారి సావరం విజయ కనకదుర్గా దేవి



ప్రత్యేక అలంకరణలో శ్రీకనక మహాలక్ష్మి అమ్మవారు



తాటికాయలవారిపాలెంలో రాజరాజేశ్వరిగా కనకదుర్గమ్మ



మోరిలో నిమజ్జనానికి దేవీ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్న గ్రామస్తులు



బి.దొడ్డవరంలో కోలాటంలో పాల్గొన్న యువతులు

కొత్తపేట: విజయదశమి పర్వదినంతో శరన్నవరాత్ర ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ నెల 15న శరన్నవరాత్ర ఉత్సవాలు ప్రారంభం కాగా గ్రామాల్లో దుర్గాదేవి ఆలయాలు, ఉత్సవ పందిర్లలో శక్తి స్వరూపిణిగా అమ్మవారిని ప్రతిష్ఠించారు. 10 రోజులు పాటు పలు ఆలయాల్లో అమ్మవారిని రోజుకో అవతారం చొప్పున నయనానందకరంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. విజయదశమి సందర్భంగా ఉదయం నుంచే భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నూతన వాహనాలు కొనుగోలు చేసిన వారు ఆలయాల వద్ద వాహన పూజలు, కార్మికులు ఆయుధ పూజలు చేశారు. కాగా శనివారం స్థానిక బొరుసువారి సావరం విజయ కనకదుర్గాదేవి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో భక్తులు సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఏనుగుల మహల్ రాజరాజేశ్వరీదేవి (శ్రీచక్రమహామేరు యంత్రం) ఆలయం, స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, షిర్డీ సాయిబాబా ఆలయం, బోడిపాలెం దుర్గాదేవి ఆలయం, వాడపాలెం జ్ఞాన సరస్వతీదేవి ఆలయాల్లో విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో అమ్మవారిని రాజ రాజేశ్వరి రూపంలో అలంకరించారు.

జమ్మిచెట్టుకు భక్తుల పూజలు..

విజయదశమి రోజు సాయంత్రం సమయంలో భక్తులు జమ్మిచెట్టు వద్దకు వెళ్లి కోరిన కోర్కెలు తీరాలంటూ జమ్మి చెట్టుకు చీటీలు కట్టారు. పేపరుపై భక్తులు శమీ మంత్రాన్ని, కోరికలను రాసి జమ్మిచెట్టుకు కట్టారు. విద్యార్థులు, యువకులు, మహిళలు జమ్మిచెట్టు వద్ద శమీ పూజలు చేశారు.

కరుణించు కనకదుర్గ...!

ఆత్రేయపురం: దుర్గాదేవి ఆలయాలు, నవరాత్రి పందిర్లలో విజయ దశమి పూజలను భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.దశమి వేడుకలతో అన్ని చోట్ల దసరా సందడి నెలకొంది. మండల పరిధిలోని ఉచ్చిలి, ఆత్రేయపురం, పేరవరం, పులిదిండి, అంకంపాలెం, ర్యాలితో పాటు మండల పరిధిలోని 17 గ్రామాల్లోని కనక దుర్గాదేవి ఆలయాలు, దేవి నవరాత్రి పందిళ్లల్లో విజయ దశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో గ్రామ దేవతల ఆలయాల్లో శరన్నవరాత్రి పూజలు జరిపి విజయ దశమి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. మండల పరిధిలోని ఉచ్చిలి గ్రామంలో వేంచేసియున్న విజయ దుర్గాదేవి అమ్మవారు రాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ర్యాలి గాయత్రీ దేవి ఆలయంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆత్రేయపురంలో శ్రీ కనక మహాలక్ష్మి, శ్రీమల్లమ్మ, శ్రీబాల త్రిపుర సుందరి, రాజరాజేశ్వరీ, దుర్గా మాత, లొల్లలాకుల వద్ద విజయ దుర్గాదేవి ఆలయాల వద్ద విజయ దశమి వేడుకలు నిర్వహించారు. అన్న సమారాధన నిర్వహించారు.

అన్న సమారాధనలు..లడ్డూ వేలం పాటలు

అంబాజీపేట: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని అంబాజీపేట మండలంలో పలు దుర్గమ్మ ఆలయాల వద్ద శని, ఆదివారాలు అన్న సమారాధనలు, లడ్డూ వేలం పాటలు నిర్వహించారు. స్థానిక పశువుల మార్కెట్ వద్ద గల విజయ కనకదుర్గ ఆలయం వద్ద ఆదివారం భారీ అన్న సమారాధన చేపట్టారు. కె.పెదపూడిలో కనక దుర్గమ్మను భారీ ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఆలయాల వద్ద లడ్డూల వేలం నిర్వహించారు. అంబాజీపేటలో శ్యామలాంబను గజవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు.

ఘనంగా దేవీ నిమజ్జనాలు

సఖినేటిపల్లి: దసరా మహోత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం మండలంలో వాడవాడలా దేవీ నిమజ్జనాలను భక్తులు ఆయా పుష్కర ఘాట్‌ల వద్ద ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన షామియానాలలో దేవీ మాత విగ్రహాలను నెలకొల్పారు. మోరి, టేకిశెట్టిపాలెం, సఖినేటిపల్లి, కేశవదాసుపాలెం తదితర గ్రామాలలో కనకదుర్గాదేవి ఆలయాలతో పాటు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద నవరాత్ర మహోత్సవాలు నిర్వహించారు. దేవీ విగ్రహాలను ట్రాక్టర్‌లపై ఊరేగింపుగా తోడ్కొని వెళ్లి టేకిశెట్టిపాలెం గోదావరి పాయ వద్ద పుష్కర ఘాట్‌లో నిమజ్జనం చేశారు.

పూర్ణాహుతితో శరన్నవరాత్ర ఉత్సవాలు సంపూర్ణం

మామిడికుదురు: పది రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన కనకదుర్గమ్మ శరన్నవరాత్ర ఉత్సవాలు శనివారం పూర్ణాహుతితో సంపూర్ణమయ్యాయి. విజయదశమి సందర్భంగా దుర్గమ్మ ఆలయాలు భక్తులతో కోలాహలంగా మారాయి. వేలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. పాశర్లపూడిబాడవ ఆలయంలో తోరం వెంకటరమణారావు ఆధ్వర్యంలో శమీపూజ, గోపూజ, ఘనంగా జరిగాయి. మగటపల్లి త్రిశక్తి పీఠంలో మహా పూర్ణాహుతి జరిగింది. పెదపట్నంలంక దుర్గమ్మ ఆలయం వద్ద శమీపూజ, మహా పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. మామిడికుదురు విజయ దుర్గమ్మ ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. బి.దొడ్డవరంలో యువతుల కోలాటం నడుమ అమ్మవారి ఊరేగింపు వైభవంగా జరిగింది. అప్పనపల్లి, లూటుకుర్రు, నగరం, పాశర్లపూడిలంక, ఆదుర్రు, పెదపట్నం, కొమరాడ, ఈదరాడ, మాకనపాలెం, గోగన్నమఠం, కరవాక, గెద్దాడ, మొగలికుదురు, తదితర గ్రామాల్లో మేళతాళాలతో అమ్మవారి ఊరేగింపు వైభవోపేతంగా జరిగింది. ముంగింపులో భాగంగా మండల పరిధిలోని పలు ఆలయాల వద్ద బుధవారం అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.

పి.గన్నవరం: మండలంలో దసరా మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. చివరి రోజున భక్తులు ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తాటికాయలవారిపాలెంలో వేంచేసిన కనకదుర్గమ్మ దసరా సందర్భంగా రాజ రాజేశ్వరీదేవి అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించిన హంస వాహనంపై గ్రామంలో ఊరేగించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. పి.గన్నవరంలోని శ్రీలక్ష్మీ కనకదుర్గమ్మ ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున పూజలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహాలను నదీపాయల్లో నిమజ్జనం చేశారు. స్థానిక అక్విడెక్టు కాలనీలో ఆదివారం భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు.

సఖినేటిపల్లి : అంతర్వేది కర గ్రామంలో కొలువైన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో విజయదశమి పర్వదినం పురస్కరించుకుని శనివారం కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. ఆలయంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద నిర్వహించిన అన్న సమారాధనలో పాల్గొని, అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఎమ్మెల్యే స్వీకరించారు. వెంట ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ జీ పెద కాపు, గెద్దం మహలక్ష్మి ప్రసాద్, గుబ్బల ఫణి, ముప్పర్తి నాని పాల్గొన్నారు.